www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 2 మే 2023
5
డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ



ఇంటర్ ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

ప్రజాశక్తి - అమలాపురం

ఇంటర్ ఫెయిలైన విద్యార్థులకు ఈనెల 1 నుంచి 20వరకూ ప్రత్యేక రెమిడీయల్ క్లాసులు నిర్వహిస్తున్నామని డిఆర్ఒ సిహెచ్.సత్తిబాబు తెలిపారు సోమవారం కలెక్టరేట్‌లోని డిఆర్ఒ ఛాంబర్‌లో వీటిపై ఆయన విద్యాశాఖ అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ, సాంఘిక సంక్షేమ శాఖ, ఎయిడెడ్ జూనియర్ కళాశాలల్లో ఈ క్లాసులు జరుగుతాయన్నారు. ఈ క్లాసులను ఆయా ప్రిన్సిపాళ్లు పర్యవేక్షించాలన్నారు. ఫెయిల్ అయిన విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. వీటి నిర్వహణ కోసం జిల్లాకు రూ.10లక్షల చొప్పున నిధులు కేటాయించారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఒకేషనల్ ఎడ్యుకేషనల్ అధికారి సత్యనారాయణరెడ్డి, ప్రాంతీయ ఇన్‌స్పెక్షన్ అధికారి నరసింహం, ప్రిన్సిపల్స్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో ముసురు

భారీ వర్షాలకు నేలకొరిగిన వరిచేలు
పలు చోట్ల తడిసి ముద్దయిన ధాన్యం
పల్లపు ప్రాంతాలు జలమయం

ప్రజాశక్తి - యంత్రాంగం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షాలకు వరిచేలు నేలకొరిగాయి. కల్లాల్లో ఉన్న ధాన్యం రాశులు తడిసి ముద్దయ్యాయి. తడిసిన ధాన్యాన్ని, ఒరిగిన చేలను మంత్రులు, అధికారులు పరిశీలించారు.

రామచంద్రపురంలో కురిసిన వర్షానికి వరిచేలు నీట మునిగాయి. వర్షం నీరు దిగేలా చర్యలు తీసుకోవాలని అన్నదాతలు అధికారులను కోరుతున్నారు. పలు రోడ్లు జలమయమయ్యాయి. జనజీవనం స్తంభించింది. భారీ వర్షాలకు వ్యాపార సంస్థలు మూతపడ్డాయి. కె.గంగవరంలోని కుందూరు పరిసర ప్రాంతాల్లోని తడిసిన ధాన్యం రాశులను మంత్రి వేణు పరిశీలించారు. ఆయన వెంట ఆర్‌డిఒ సింధు, కె.గంగవరం ఎంపిపి పంపన నాగమణి ఉన్నారు. **కాట్రేనికోన** సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఏకధాటిగా కురిసిన వర్షానికి ధాన్యం రాసులు, వరి పనలు తడిసిపోయాయి. పంటను కాపాడుకునేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. పల్లంకుర్రు, కందికుప్ప, గెద్దనపల్లి, కాట్రేనికోన తదితర ప్రాంతాల్లో ధాన్యం రాసుల చుట్టూ నీరు చేరింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ఎలక్ట్రికల్ ఎఇ బి.నాగేశ్వరరావు సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. **ఆత్రేయపురం** భారీ వర్షాలకు వరి రాశులు నీటిలో నానుతున్నాయి మండలంలో 5,500 ఎకరాల్లో ధాన్యం తడిసినట్టు సమాచారం. గోనె సంచులు లేక, ధాన్యం కొనుగోలు చేయక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఆత్రేయపురం, వెలిచేరు, ర్యాలి, వాడపల్లి, వద్దిపర్రు గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. ఆత్రేయపురం దళిత పేట పెద్ద పేటలో డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో వర్షపు నీరు ఇళ్లల్లోకి చేరుతుంది. **కపిలేశ్వరపురం** మండలంలో వెదురుమూడిలో తడిసిన ధాన్యం రాశులను ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు తొందరపడి తక్కువ రేటుకు అమ్ముకోవద్దని సూచించారు. కలెక్టర్ నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే ధాన్యం కొనుగోలు చేస్తారన్నారు. ఆయన వెంట ఎంపిపి ఎం.సత్యవేణి, వైస్ ఎంపిపి గుణం భాను ప్రసాద్, తహశీల్దార్ కె.సూర్యారావు, ఎంపిడిఒ ఎం.రామకృష్ణారెడ్డి, ఎఒ రమేష్ కుమార్ ఉన్నారు. **మండపేటలో** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి జనజీవనం స్తంభించింది. పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఏడిదలో అంబేద్కర్ విగ్రహం ఎదుటి వీధిలో మురుగునీరు రోడ్లపైకి చేరింది. తాపేశ్వరం, విజయలక్ష్మి నగర్ తదితర ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్ లైన్లపై పడటంతో సరఫరాకు అంతరాయం కలిగింది. మండపేట పట్టణంలో ఒక వ్యక్తి అంత్యక్రియలను కుటుంబ సభ్యులు వర్షంలోనే నిర్వహించారు.


కె.గంగవరం మండలంలో పడిపోయిన వరిచేను చూపుతున్న రైతు


కాట్రేనికోన మండలంలో తడిసన పనలు ఒబ్బిడి చేసుకుంటున్న రైతు

అధికారుల పర్యటన

తడిసిన ధాన్యాన్ని, నీటమునిగిన వరి పొలాలను అధికారులు పరిశీలించారు. రైతులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. **మండపేటలో** ఆర్‌డిఒ సింధు వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పంటను పరిశీలించారు. తడిసిన ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. రైతులు సాధ్యమైనంత వరకు ధాన్యాన్ని పల్లపు ప్రదేశాల నుంచి ఎత్తైన ప్రదేశాలకు తీసుకురావాలని తెలిపారు. రానున్న రెండు రోజుల్లో వర్షాలు వస్తాయని, ఈ మేరకు కోతలను ఆపాలని సూచించారు. ఎఒ కె.ప్రభాకర్ ధాన్యం రాశుల వద్ద నీరు లేకుండా చూసుకోవాలన్నారు. ధాన్యం మొలకెత్తకుండా రంగు మారకుండా కాపాడుకోవాలన్నారు. **ఆలమూరులో** పొలాలను జెసి ధ్యానచంద్ర పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు నష్టం రాకుండా తగు చర్యలు తీసుకుంటామన్నారు. ధాన్యం మొత్తం ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులకు భరోసా ఇచ్చారు. నష్టాన్ని అంచనా వేసి నివేదికలు త్వరగా పంపాలని ఇప్పటికే ముఖ్యమంత్రి ఆదేశించారన్నారు. నష్టపోయిన ప్రతీ రైతుకు పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట వ్యవసాయ శాఖ జెడి కాకి నాగేశ్వరరావు, తహశీల్దార్ ఐపి.శెట్టి, ఎఒ ఎస్.లక్ష్మీలావణ్య ఉన్నారు. అలాగే తడిసిన ధాన్యం రాశులను ఎంపిపి తోరాటి లక్ష్మణరావు, ఎంపిడిఒ జాన్ లింకన్, సర్పంచులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. **అమలాపురం** డివిజన్ అల్లవరం మండలం కోడురుపాడులో వరిపొలాను ఆర్‌డిఒ వసంతరాయుడు పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. అధిక వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులందరూ అప్రమత్తంగా ఉండాలి అన్నారు వరి కోతలు వాయిదా వేసుకోవాలన్నారు. తడచిన వరి పంటను తిరగవేసి పొలాల్లో నీరు లేకుండా చూసుకోవాలన్నారు. ఆయన వెంట ఎఒ సత్యనారాయణ, సర్పంచ్ నడింపల్లి సుబ్బరాజు , పంచాయతీ కార్యదర్శి ఆర్ మోహన్ ఉన్నారు. **ఆత్రేయపురం** మండలంలో తడిసిన ధాన్యం రాశులను ఆర్‌డిఒ ముక్కంటి పరిశీలించారు. పలు సమస్యలను రైతులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యలను పరిష్కరించాలని ఎఒ పట్టాభి రామయ్యను ఆదేశించారు. ఆయన వెంట జడ్‌పిటిసి సభ్యులు బోనం సాయిబాబా, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కనుమూరి శ్రీనివాసరాజు, తహశీల్దార్ డివిఎన్.అనిల్ కుమార్, ఎంపిడిఒ నాతి బుజ్జి,, వెలిచేరు సర్పంచ్ వేముల శ్రీనివాస్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు. **ఉప్పలగుప్తంలో** కురిసిన భారీ వర్షానికి తీవ్రంగా నష్టపోయామని రైతులు వాపోతున్నారు. మండలంలో 6,821 ఎకరాల్లో వరి సాగు చేయగా 5,325 ఎకరాల్లో వరి కోతలు పూర్తయ్యాయి. 160 ఎకరాల్లో పంట పనలపై ఉంది. 589 ఎకరాల్లో పంట వరి కుప్పలుగా ఉందని, మరో 537 ఎకరాల్లో ధాన్యం రాశులపై ఉంది. వర్షాలకు ఇవన్నీ తడిసి ముద్దయ్యాయి. పంటను రక్షించుకునేందుకు ఉపాధి కూలీలను వినియోగించుకోవాలని ఎఒ జి.కుమార్‌బాబు తెలిపారు. వర్షానికి దెబ్బతిన్న పంట పొలాలను ఎంపిడిఒ కెఎస్ గౌరికుమారి పరిశీలించారు.


మండపేట మండలంలో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డిఒ సింధు

రైతులను ఆదుకోవాలి

ఆలమూరు : వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని తెలుగురైతు మండల అధ్యక్షులు గొడవర్తి దుర్గాప్రసాద్ డిమాండ్ చేశారు. భారీ వర్షాలకు రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించాలన్నారు. అలాగే మండలంలోని పినపళ్లలో తడిసిన ధాన్యాన్ని జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి, సర్పంచ్ సంగీత సుభాష్ పరిశీలించారు. ఆయన వెంట ఎంపిటిసి పెద్దిరెడ్డి పట్టాభి, నాయకులు నామాల సుబ్బారావు, చోడిశెట్టి సత్యనారాయణ, కొనగళ్ళ శ్రీను ఉన్నారు.


సభలో మాట్లాడుతున్న ఐవి

బిజెపి ఓటమితోనే దేశానికి రక్షణ

ప్రచారభేరి ముగింపు సభలో వక్తలు

ప్రజాశక్తి - అమలాపురం

కేంద్రంలో మోడీ ప్రభుత్వాన్ని గద్దెదింపితేనే దేశన్ని కాపాడుకోగలమని పలువురు వక్తలు అన్నారు. ప్రచారభేరి ముగింపు సభ సోమవారం అమలాపురంలోని గడియారస్తంభం సెంటర్‌లో జరిగింది. సిపిఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారామ్, సిపిఐ నాయకులు డేగా ప్రభాకర్, పిడిఎఫ్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంతెన సీతారాం మాట్లాడుతూ నరేంద్ర మోడీ నేతత్వంలోనీ బిజెపి ప్రభుత్వం అదానీకి చెందిన కంపెనీలకు దేశ సంపదను దోచి పెడుతుందన్నారు. అదానీ అక్రమాలను హైడెన్ బర్గ్ సంస్థ బయట పెట్టినా ప్రభుత్వానికి చీమకుట్టినట్టయినా లేదన్నారు. మోడీ, అదానీ సంబంధాలు, అదానీ కంపెనీల అక్రమాలపైన జాయింట్ పార్లమెంటరీ కమిటీతో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. సిపిఐ నాయకులు డేగా ప్రభాకర్ మాట్లాడుతూ మోడీ అమిత్‌ల నాయకత్వంలో బిజెపి, ఆర్‌ఎస్ఎస్ కూటమి ప్రజల మధ్య మత విద్వేషాలను సృష్టిస్తున్నాయనానరు. అక్రమాలపై ప్రశ్నించేవారిని నిరంకుశంగా అణచివేస్తున్నారన్నారు. ఎంఎల్‌ఎ ఐవి మాట్లాడుతూ ఎందరో త్యాగాలతో వచ్చిన స్వాతంత్ర్యం నేడు ప్రమాదంలో పడిందన్నారు. దేశాన్ని కాపాడుకునేందుకు నాటి జాతీయోద్యమ స్ఫూర్తితో మళ్లీ ఉద్యమించాల్సిన సమయం వచ్చిందన్నారు. సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దేశసంపదను, వ్యవసాయాన్ని సైతం కార్పొరేట్లకు కేంద్ర ప్రభుత్వం ధారాదత్తం చేస్తోందన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి సత్తిబాబు మాట్లాడుతూ బిజెపి హయాంలో ప్రభుత్వరంగ సంస్థలన్నీ నిర్వీర్యమవుతున్నాయన్నారు. తొలుత నాయకుడు పచ్చిమాల వసంతకుమార్ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులిర్పంచారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పీతల రామచంద్రరావు, సిపిఐ జిల్లా సమితి నాయకులు నిమ్మకాయల శ్రీనివాసరావు, నియోజకవర్గం కార్యదర్శి అడపా సత్యనారాయణ, నాయకులు బి.శ్రీను, కె.శంకర్, కె.ప్రణీత్‌సాయి, ఊటాల వెంకటేష్, ఎన్.సురేష్, జి.దైవకృప, ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.


వసంతకుమార్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

వ్యాన్‌ను ఢీకొన్న ట్రావెల్ బస్సు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

ముమ్మిడివరంలో 216 జాతీయ రహదారి బొండాయికోడు తూము పెట్రోల్ బంక్ వద్ద రొయ్యల లోడ్‌తో ఉన్న హైచర్ వ్యాన్‌ను ట్రావెల్ బస్ ఢీకొట్టింది. ఇదే సమయంలో హైదరాబాద్‌కు చెందిన మరో ప్రయివేటు బస్సు డ్రైవర్ ప్రమాదం చూసి సడెన్ బ్రేక్ వేయడంతో అదుపుతప్పి పంట బోదెలో పడిపోయింది. ఈ ప్రమాదంల్లో పలువురు స్వల్ప గాయాలతో బయట పడ్డారు.

ఘనంగా ఎస్అర్ఎల్‌జి వార్షికోత్సవం

ప్రజాశక్తి-రాజోలు

ఎస్అర్ఎల్‌జి కళాసమితి 60వ వార్షోత్సవం పొదలాడ కళాసమితి భవనంలో ఘనంగా జరిగింది. కళాసమితి సమితి అధ్యక్షుడు పుల్లెల వరప్రసాద్ అధ్యక్షతన రెండు రోజుల పాటు ఈ వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ఎంపిపి కేతా శ్రీనివాస్, పొదలాడ, తాటిపాక సర్పంచ్‌లు కడలి సత్యనారాయణ, కోటిపల్లి రత్నమాల ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. తొలుత కళాసమితి వ్యవస్థాపకులు పుల్లెల కొండయ్య పుట్టినరోజు సందర్భంగా కేక్‌ను ఎంపిపి కట్ చేసి కళాకారులకు పంచారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు పొందిన ఎస్ఆర్ఎల్‌జి కళాసమితి అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. సర్పంచ్‌లు సత్తి పండు, రత్నమాల మాట్లాడుతూ అంతరించి పోతున్న కళలకు జీవం పోస్తున్న కళాసమితి సేవలు అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా పుల్లెల కొండయ్య రచించిన 'చదువెందుకు' నాటకంతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. అనంతరం కళాకారులను, ప్రజా ప్రతినిధులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి మాజీ చైర్మన్ కాంద్రేగుల సత్యనారాయణ, ఎంపిటిసి సభ్యులు శిరిగినీడి వెంకటేశ్వరరావు, కొల్లాబత్తుల సతీష్‌బాబు, లిఖితపూడి బుజ్జి, పోతురాజు రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తి నిండగ.. కష్టజీవి పండుగ

ప్రజాశక్తి - యంత్రాంగం

ఓ పక్క జోరున వాన కురుస్తున్నా జిల్లాలో మేడే హోరు కొనసాగింది. వానలోనే కార్మికులు ర్యాలీలు, పతాకావిష్కరణలు నిర్వహించారు. అరుణపతాకాలతో జిల్లా అరుణార్ణవాన్ని సంతరించుకుంది. జోరువానలో కార్మికుల నినాదాలు హోరెత్తాయి. హక్కుల కోసం సంఘటితంగా పోరాడాలని నాయకులు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. **మండపేటలో** మే డే దినోత్సవ వేడుకలు సిఐటియు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక కలువ పువ్వు, కరాచీ సెంటర్లలో మేడే జెండాలను ఆవిష్కరించారు. అనంతరం టౌన్ హాల్‌లో నిర్వహించిన హిరంగ సభలో సిఐటియు జిల్లా కార్యదర్శి కె.కృష్ణవేణి తదితరులు మాట్లాడారు. లక్షలాది మందికి ఉపాధిని కల్పిస్తున్న విశాఖ ఉక్కును కేంద్ర ప్రభుత్వం ప్రవేటుపరం చేస్తుందన్నారు. కార్మికుల హక్కులను కాలరాస్తుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు అనిల్‌కుమార్, పిఎసిఎస్ రాష్ట్ర అధ్యక్షులు తోట వెంకటరామయ్య, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎస్.కె ఇబ్రహీం, అంగన్వాడి వర్కర్స్ యూనియన్ నాయకులు మేడిశెట్టి బేబీ, కుమారి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు బంగారు, కొండ కొమరపు నరేంద్ర కుమార్, పిఎన్ఎం అధ్యక్షులు శామ్యూల్, ప్రముఖ న్యాయవాదులు నారాయణరెడ్డి, ధూళి జయరాజు, ఐఎన్‌టియుసి అధికార ప్రతినిధి వారా ప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు. **రామచంద్రపురం** మండలం ద్రాక్షారామ అన్నయ్యపేట సెంటర్‌లో శ్రీ భీమేశ్వర గూడ్స్ అండ్ ఓనర్స్ అసోసియేషన్, ఇఫ్టూ ఆధ్వర్యంలో మేడే దినోత్సవాన్ని నిర్వహించారు. యూనియన్ నాయకులు పాలికా సత్తిబాబు ఎర్రజెండాను ఎగవేశారు. సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు వెంటపల్లి భీమశంకరం మాట్లాడారు. టేకుమూడి అంజి, పి.శ్రీను, యు.స్వామి, కె.రమణ తదితరులు పాల్గొన్నారు. రామచంద్రపురం మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన మేడే దినోత్సవంలో మంత్రి వేణుగోపాలకృష్ణ పాల్గొన్నారు. కార్మికులకు మేడే శుభాకాంక్షలు తెలిపారు. పారిశుధ్య కార్మికులకు వర్షపు సూట్లు, సబ్బులు అందించారు. మున్సిపల్ చైర్మన్ జి.శ్రీదేవి, కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి, కౌన్సిలర్లు, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు. **కాట్రేనికోనలో** సిఐటియు నాయకులు మోహన్‌రావు, రాంబాబు ఆధ్వర్యంలో మేడేను నిర్వహించారు. కాట్రేనికోన, దొంతుకూరు, పల్లంకురు ప్రాంతాల్లో అరుణపతకాలను ఆవిష్కరించారు. పల్లంకుర్రు మార్కెట్ వద్ద జరిగిన సమావేశంలో సిఐటియు మండల అధ్యక్షులు విప్పర్తి మోహన్‌రావు, కార్యదర్శి విత్తనాల రాంబాబు, యుటిఎఫ్ నాయకులు వడ్డీ శ్రీనివాస్‌రావు మాట్లాడారు. **ఉప్పలగుప్తంలో** సిఐటియు నాయకులు పి.బేబీగంగారత్నం ఆధ్వర్యంలో ఎర్రజెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. మేడే స్ఫూర్తితో శ్రమజీవుల హక్కుల సాధన కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సరిపల్లెలో ఇఫ్టూ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు పాల్గొని మాట్లాడారు. **కపిలేశ్వరపురంలో** యుటిఎఫ్, సిఐటియు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మేడే వేడుకలు జరిగాయి. మేడిశెట్టి బేబి ఎం.జానకిదేవి, పి.సురేంద్ర కుమార్, సూరిబాబు, జువ్వల శ్రీనివాస్ పాల్గొన్నారు. **ఐ.పోలవరంలో** సిఐటియు, యుటిఎఫ్ ఇతర ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మేడే వేడుకలు నిర్వహించారు. అరుణపతాకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు జి.గంగాభవాని, ఉపాధ్యక్షులు నిమ్మకాయల వెంకటేష్, కార్యదర్శి డి.నాగలక్ష్మి, నాగమణి పాల్గొన్నారు. **ఆలమూరు** తహశీల్దార్ కార్యాలయం వద్ద సిఐటియు, యుటిఎఫ్ నాయకులు అరుణపతాకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ మండల కార్యదర్శి కెవిఆర్.బాపూజీ, యుటిఎఫ్ నాయకులు వైవివి.రమణ, పివివిజిఎస్ఎన్.మూర్తి, అంగన్‌వాడీ నాయకులు జి.ధనలక్ష్మి, ఎం.వెంకటలక్ష్మి, కె.మెర్సిఫ్లోరెన్స్ తదితరులు పాల్గొన్నారు. **ముమ్మిడివరంలో** సిఐటియు ఆధ్వర్యంలో మే డేను ఘనంగా నిర్వహించారు సీనియర్ నాయకులు సకిలే సూర్యనారాయణ ఎర్ర జెండాను ఆవిష్కరించారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డి.,వీరరాఘవులు, వెంకటేష్‌కార్మికులు పాల్గొన్నారు **రాజోలులో** సిఐటియు ఆధ్వర్యంలో శ్రీ కుంతలేశ్వరి అమ్మవారి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో మేడే వేడుకలు జరిగాయి. రాజోలు ఎస్ఐ పృథ్వీ ముఖ్యఅతిథిగా హాజరై ఎర్రజెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షులు పితాని సురేంద్ర, బస్టాండ్ యూనియన్ అధ్యక్షులు చింతపల్లి రాము, చింత సుదర్శన్‌రావు, జి.కార్తీక్ సిఐటియు నాయకులు ఆటో కార్మికులు పాల్గొన్నారు.



మండపేటలో సిఐటియు ఆధ్వర్యంలో కార్మిక సంఘాల ర్యాలీ


ఉప్పలగుప్తంలో...



కాట్రేనికోనలో..


ఆలమూరులో...

కార్టూ'నిజం'



ఎస్‌పిని కలిసిన కరాటం ప్రవీణ్

అమలాపురం రూరల్ : నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్‌పి శ్రీధర్‌ను సేవారత్న కరాటం ప్రవీణ్ సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2013-14లో డిఎస్‌పిగా పని చేసిన శ్రీధర్‌తో ఉన్న స్నేహాన్ని గుర్తు చేసుకున్నారు. గతంలో అమలాపురంలో పని చేసినప్పుడు నిస్వార్థంగా సేవాభావంతో పనిచేశారని, అదే పంథాను కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వరా డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ కె.నరసింహరావు, సీలి సంసొన్, ప్రిన్సిపల్ కె.మనోహర్, కరాటం సూరిబాబు, ఎ.సోమేశ్వరరావు, వై.వరప్రసాద్, సిహెచ్.జాన్‌పాల్ పాల్గొన్నారు.

బాలబాలాజీ దేవస్థానం ఎసిగా వరప్రసాదరావు

ప్రజాశక్తి-మామిడికుదురు


అప్పనపల్లి బాల బాలాజీ దేవస్థానం సమాయ కమిషనర్‌గా డి.శ్రీరామ వరప్రసాదరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో తిరుమలగిరి దేవస్థానంలో పనిచేశారు. బదిలీపై అప్పనపల్లి వచ్చారు. ఆయనకు ఆలయ చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ధర్మకర్తల మండలి సభ్యులు కొమ్ముల సూరిబాబు, గుత్తుల భానుప్రకాష్, ఆలయ ఉప ప్రధాన అర్చకులు మద్దాలి తిరుమల శింగరాచార్యులు, ఆలయ అర్చకులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.


ఎసికి శుభాకాంక్షలు చెబుతున్న చైర్మన్ తదితరులు

నేత్ర వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - మండపేట

జగనన్న కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న కంటి వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం అన్నారు. సోమవారం మండ లంలోని ఏడిద సచివాలయంలో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ వైద్య శిబిరంలో 65 మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇద్దరికి శస్త్ర చికిత్స అవసరమని గుర్తించారు. 40 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. మిగిలిన వారికి మందులు అందజేశారు. శస్త్ర చికిత్స అవసరమైన వారిని రామచంద్రపురం ప్రభుత్వ ఆసుపత్రిలో ఆపరేషన్ చేయిస్తామని ఆప్తాలమిక్ సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి యు.వీర్రాజు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.


ఐడ్రాప్స్ అందిస్తున్న సర్పంచ్ ఆశీర్వాదం

హోటల్స్‌కు ట్రేడ్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

ప్రజాశక్తి - అమలాపురం

హోటళ్లకు ట్రేడ్ రిజిస్ట్రేషన్‌ను తప్పనిసరిగా చేయించుకోవాలని జిల్లా పర్యాటక అధికారి పి.వెంకటాచలం సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు హోటల్స్, లాడ్జిలు, రెస్టారెంట్లు, వెల్‌నెస్ సెంటర్లు,ట్రావెల్ ఆపరేటర్లు అందరూ ట్రేడ్ రిజిస్ట్రేషను చేసుకోవాలని పర్యాటకశాఖ ముఖ్యకార్యదర్శి అదేశాలు జారీ చేశారన్నారు. ఎపి టూరిజం వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. వివరాలకు 6309942025, 7386229961 నెంబర్లను సంప్రదించాలన్నారు.

స్పందనలో అర్జీలకు పరిష్కారం

అమలాపురం : ప్రతి అర్జీని క్షుణ్ణంగా విచారించి నిబంధనల మేరకు పరిష్కరించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందనలో డిఆర్ఒ సిహెచ్.సత్తిబాబుతో కలిసి ఆయన అర్జీలు స్వీకరించారు. మొత్తం 50 అర్జీలను స్వీకరించామని తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ స్పందన కార్యక్రమాన్ని ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందన్నారు. ఈ దృష్ట్యా ప్రతి అర్జీని అధికారులు పరిశీలించి పరిష్కారం చూపాలాన్నరు. అర్జీలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. అకాల వర్షాల కారణంగా రైతులకు క్షేత్రస్థాయిలో అధికార యంత్రాంగం అండగా నిలిచి ధాన్యం కొనుగోలులో పూర్తిగా సహకరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిపిఓ వెంకటేశ్వర్లు, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్ ఎస్ఇలు సిహెచ్‌ఎన్‌వి.కృష్ణారెడ్డి, బి.రాము, కె.చంటి బాబు, గృహ నిర్మాణ సంస్థ జిల్లా ఇంజినీర్ సిహెచ్. బాబూరావు, వ్యవసాయ శాఖ ఎడి సంషీ, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి జివి.సత్యవాణి, డ్వామా పీడీ, జిల్లా పంచాయతీ అధికారి ఎస్.మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలు చేసినవారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

దౌర్జన్యంగా బంధువుల ఇంటి పునాదులను జెసిబితో కూల్చివేస్తున్నందుకు అడిగిన తనపై అసత్య ఆరోపణలు చేస్తూ అవమానించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ ఎస్.యానానికి చెందిన తాడి గోపాలకృష్ణ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు నకళ్లను స్థానిక విలేకరులకు అందజేశారు. తనను అవమానించే విధంగా కలెక్టరేట్‌లో ఫ్లెక్సీలతో ఆందోళన చేసి కలెక్టర్‌కు తప్పుడు ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు.

నేరాలు ఘోరాలు

వ్యాన్ ఢీకొని ఆటో డ్రైవర్ మృతి

ప్రజాశక్తి - జగ్గంపేట

వ్యాన్ ఢీకొనడంతో ఆటో డ్రైవర్ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు జగ్గంపేట ఎస్ఐ విద్యాసాగర్ తెలిపారు. శనివారం అర్ధరాత్రి 12 గంటలు దాటిన సమయంలో జగ్గంపేట మండలం రామవరం జాతీయ రహదారిపై బొప్పూడి సిరామిక్స్ ఫ్యాక్టరీ ఎదురుగా ఎర్రవరం నుంచి జగ్గంపేట వైపు వస్తున్న ఆటోను విశాఖపట్నం నుంచి వస్తున్న ఐషర్ వ్యాన్ డ్రైవర్ నిర్లక్ష్యంగా వాహనాన్ని నడుపుతూ ఆటోని బలంగా ఢీకొట్టడంతో ఆటో పల్టీలు పడి ఆటో డ్రైవర్ గూనపల్లి లక్ష్మీ నారాయణ (27) మృతి చెందాడని జగ్గంపేట ఎస్ఐ తెలిపారు. జగ్గంపేట నెహ్రూ కాలనీకి చెందిన మృతుడు లక్ష్మీ నారాయణ సొంత ఆటోలో ప్రతిరోజు సాయంత్రం కట్టమూరు, కాట్రావుల పల్లి గ్రామాలలోని పాల కేంద్రాల వద్ద నుంచి పాలు సేకరించి ఎర్రవరం లోని హెరిటేజ్ డైరీకి పాలను క్యాన్ల ద్వారా తరలిస్తూ టాడని తెలిపారు. శనివారం రాత్రి పాలను ఎర్రవరంలో అన్లోడ్ చేసి తిరిగి వస్తుండగా రామవరం బొప్పూడి సిరామిక్ ఫ్యాక్టరీ వద్దకు వచ్చేసరికి విశాఖపట్నం వైపు నుంచి వస్తున్న డిసిఎం వ్యాన్ డ్రైవర్ నిర్లక్ష్యంగా ఆటో ని ఢీ కొట్టాడని, సంఘటనా స్థలానికి వెళ్లి కొన ఊపిరితో ఉన్న లక్ష్మీనారాయణను జగ్గంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారని ఎస్ఐ తెలిపారు. ఈ ఘటనపై మృతుడి భార్య గూనపల్లి అపర్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విద్యాసాగర్ తెలిపారు. మృతదేహానికి పోస్టు మార్టం అనంతరం బంధువులకు అందజేశారు. మృతునికి వివాహమై 9 సంవత్సరాలు అయిందని, ఐదు సంవత్సరాల పాప ఉన్నట్లు తెలిపారు.

గుర్తు తెలిని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - గండేపల్లి

గండేపల్లి మండలం బొర్రంపాలెం చెరువులో గుర్తుతెలిని వ్యక్తి మతదేహం లభ్యమయిందని స్థానిక ఎస్ఐ వై గణేష్ కుమార్ తెలిపారు. సోమవారం సాయంత్రం సుమారు నాలుగు గంటల సమయంలో బొర్రంపాలెం గ్రామంలోని జాతీయ రహదారిపై పక్కన ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్ సమీపంలోని "సందొడు "చెరువులోని" గుంతలో సుమారు 35 నుండి 40 సంవత్సరాల వయసు గల వ్యక్తి మృతదేహం లభ్యమైంది. అతను ఒంటిపై ఏ విధమైన దుస్తులు లేవన్నారు. అతను గత కొన్ని రోజులుగా ఒంటిపై దుస్తులు లేకుండా మతిస్థిమితం లేకుండా చుట్టుపక్కల ప్రాంతాల్లో తిరుగుతున్నట్లుగా గ్రామస్తులు తెలిపారన్నారు. బొర్రంపాలెం విఆర్ఓ లాజరు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి.. మతదేహాన్ని రాజమండ్రి ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ వై గణేష్ కుమార్ తెలిపారు. మృతుని వివరములు ఎవరికైనా తెలిస్తే గండేపల్లి పోలీస్‌స్టేషన్‌లో తెలియ పరచవలసిందిగా ఆయన కోరారు.

మహిళను బెదిరించి నగలు చోరీ

ప్రజాశక్తి - కాకినాడరూరల్

స్థానిక ఇంద్రపాలెంలో టీవీ చూస్తున్న మహిళను ఇద్దరు దొంగలు బెదిరించి దోచుకుపోయినట్లు ఇంద్రపాలెం ఎస్ఐ ఎం.నాగరాజు తెలిపారు. ఇంద్రపాలెం బ్రిడ్జి వద్ద వెదురుపల్లి శ్రీనివాసరావు గత కొంత కాలంగా ఒక ఇంట్లో కింది పోర్షన్‌లో కిరాణా దుకాణం నిర్వహిస్తూ, పైన నివాసం ఏర్పరచుకుని ఉంటున్నారు. సోమవారం ఉదయం ఆయన భార్య ఒంటరిగా టీ.వి చూస్తున్న క్రమంలో ఇద్దరు దుండగులు బయట ఆరబెట్టిన దుస్తులను గుర్తు తెలియకుండా ముఖంపై కప్పుకుని చంపుతామని బెదిరించి లాకర్ తాళాలు తెరిచి సుమారు 15కాసుల బంగారం, వెండి నగలను దోచుకుపోయారు. ఈ మేరకు డాగ్ స్క్వాడ్‌ను రప్పించి ఎస్ఐ నాగరాజు దర్యాప్తు చేపట్టారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.కాగా క్రైమ్ డిఎస్‌పి రాంబాబు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

21 కేజీల గంజాయి స్వాధీనం ఆరుగురు అరెస్టు

ప్రజాశక్తి-మండపేట

రాయవరం మండలంలోని లొల్ల శివారు ప్రాంతంలో 21 కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి రూరల్ సిఐ శివగణేష్ తెలిపిన వివరాల ప్రకారం అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం మండలానికి చెందిన కాలపు విజయ్ కుమార్ 21 కేజీల గంజాయిని మండపేట పట్టణ, మండలంలోని ద్వారపూడికి చెందిన గంటా దుర్గా ప్రసాద్, మేకా శివ శ్యామ్ ప్రసాద్, జెర్రి రామచంద్ర శ్యామ్, చింతలపూడి చక్రధర్, కాకి పవన్ దుర్గా రాజులకు లొల్ల గ్రామ శివారు సీతంకోట శ్మశానం వద్ద అమ్ముతున్నాడు. పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు డిప్యూటీ తహసీల్దార్ విజయరేఖ సమక్షంలో రాయవరం ఎస్ఐ సురేష్, పోలీసు సిబ్బంది వారిని అదుపులోకి తీసుకున్నారు. గంజాయి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసారు.

వివాహిత ఆత్మహత్య కేసులో 10 ఏళ్ల జైలు

ప్రజాశక్తి-అమలాపురం

2018లో అమలాపురం పట్టణ పరిధిలో విద్యుత్ నగర్‌లో గృహహింసకు పాల్పడి వివాహిత ఆత్మహత్యకు కారణమైన కేసులో నిందితులకు పదేళ్ల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ రాజమండ్రి సెషన్స్ కోర్టు జడ్జి తీర్పు ఇచ్చారు. విద్యుత్ నగర్‌కు చెందిన రావూరి వెంకటేశ్వరరావు కుమార్తె అరుణాదేవిని ఫ్రెంచి యానాంకు చెందిన కామిశెట్టి వెంకట పెరుమాళ్లుకు 2018లో వివాహం చేశారు. అనంతరం పెరుమాళ్లు తల్లిదండ్రులు ఆడపడుచు కలిసి అదనపు కట్నం కోసం అరుణాదేవిని వేధించారు. దీంతో ఆమె తీవ్ర మానసిక వేదనకు గురై తల్లి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. అమలాపురం టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేశారు. నేరం రుజువైనందున కామిశెట్టి వెంకట పెరుమాళ్లు, తండ్రి కామిశెట్టి తిరుకోటేశ్వరరావు, తల్లి కామిశెట్టి చినఅమ్మాజీ, ఆడపడుచు నామాని త్రినాధేశ్వరికి 10 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు.

వాలంటీర్ల సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-గోపాలపురం

వాలంటీర్ల సేవలు అభినందనీయని సర్పంచ్ ముళ్ళపూడి వరలక్ష్మి, ఎంపిటిసి బచ్చు రమేష్ అన్నారు. సోమవారం మండలంలోని చెరుకుమిల్లిలో వారు మాట్లాడుతూ ఎడతెరపి లేని వర్షం పడుతున్నప్పటికీ ఒకటో తేదీన ఇవాల్సిన పింఛన్లు వర్షంలో వెళ్లి అబ్ధిదారులకు అందించడం పట్ల వాలంటీర్లను అభినందించారు.

యానాం వార్తలు


మేడే వేడుకల్లో పాల్గొన్న కార్మికులు

మే డే జెండా ఆవిష్కరణ

ప్రజాశక్తి - యానాం

స్థానిక గాయత్రి రైస్ మిల్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో నాయకులు దాసరి రాజు చేతుల మేడే జెండాను ఆవిష్కరించారు. యానాం స్టీల్స్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జెండాను ఎగురవేసి అక్కడి నుండి ర్యాలీగా బయలుదేరి యానాం పాత బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి సలాది నాగేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సిఐటియు జెండాను పెయ్యల వెంకటేశ్వరరావు ఎగరవేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సిఐటియు జిల్లా కార్యదర్శి గుదే దుర్గాప్రసాద్ మాట్లాడుతూ మాట్లాడారు.కార్మికులంతా మేడే స్ఫూర్తితో కార్మికుల హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దాసరి పూర్ణిమ రాజు,సబ్బతి రాంబాబు,కమిడి శ్రీను,ముగుండ శ్రీను,మాధవ స్వామి, అప్పారావు,వివిధ సంఘాల నాయకులు,కార్మికులు పాల్గొన్నారు.


కాలనీ వాసితో మాట్లాడుతున్న ఆర్ఎఒ మునిస్వామి

చెరువులను తలపిస్తున్న యానాం రోడ్లు

సోమవారం ఉదయం కురిసిన భారీ వర్షానికి యానాంలో ప్రధాన రహదారులు, పలు కాలనీలు నీట మునిగి చెరువులను తలపించాయి. పిల్లారాయ వీధి, జిక్రియా నగర్,దోబీ స్ట్రీట్, కొత్తపేట,ఫెర్రీ రోడ్,సుబ్రహ్మణ్య భారతి వీధి రోడ్లపై నీరు నిలిచిపోవడంతో వాహనదారులు బాటసారులు ఇబ్బందులు పడ్డారు. ఈ మేరకు ఆర్ఎఒ మునుస్వామి, మున్సిపల్ కమిషనర్ ద్విజ్ గోయల్ సంబంధిత అధికారులతో కలిసి నీట మునిగిన గ్రామాల్లో పర్యటించి ప్రజలకు సలహాలు సూచనలు చేశారు.

రోడ్లు, డ్రెయినేజీలు లేక ప్రజల ఇబ్బందులు

కనకాలపేట గ్రామం జమ్మి బాడవ, గాయత్రీ కాలనీలో రోడ్లు, డ్రెయినేజీలు లేక వర్షపు నీరు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మహిళా సంఘం అధ్యక్షురాలు మాగాపు సుబ్బలక్ష్మి అన్నారు. ఈ మేరకు సోమవారం మహిళలు తమ సమస్యలను సుబ్బలక్ష్మి దృష్టికి తీసుకెళ్లడంతో వర్షంలో వెళ్లి అక్కడ పరిస్థితిని స్వయంగా ఆవిడ పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ లేఅవుట్ వ్యాపారస్తులు, అధికారులు నిర్లక్ష్యం వల్లే ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, వెంటనే సంబంధిత అధికారులు స్పందించి రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలని డిమాండ్ చేశారు.


కాలనీవాసులతో మాట్లాడుతున్న మాగాపు సుబ్బలక్ష్మి


ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు తీసుకుని వస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ


కళ్యాణవేదికపై స్వామి అమ్మవార్లకు కళ్యాణ జరిపిస్తున్న రుత్వికులు


సత్యదేవ చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి సత్యనారాయణ

కన్నుల పండువగా సత్యదేవుని కల్యాణం

ప్రజాశక్తి - అన్నవరం

అన్నవరం రత్నగిరిపై వేంచేసియున్న శ్రీ వీర వేంకట సత్యన్నారాయణ స్వామి వార్షిక కళ్యాణ మహోత్సవం సోమవారం రాత్రి 9:30 గంటల నుండి అంగరంగ వైభవంగా జరిగింది. స్మార్త ఆగమశాస్త్ర ప్రకారం నిర్వహించిన ఈ కళ్యాణాన్ని వీక్షించేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి యాత్రికులు తరలిరావడంతో రత్నగిరి జనసంద్రోహమైంది. ఉదయం 8 గంటలకు అంకురార్పణ చేసి ధ్వజారోహణ గావించారు. రాత్రి 7 గంటలకు వధూవరులైన శ్రీసత్యదేవుని వెండి గరుడవాహనం పైన, అనంతలక్ష్మీ అమ్మ వారిని వెండి గజవాహనం పైన, పెండ్లిపెద్దలైన క్షేత్రపాలకులు సీతారాములను వెండిపల్లకి లోను గ్రామంలో ఊరేగించి కళ్యాణవేదిక వద్దకు తోడ్కొని వచ్చారు. కళ్యాణానికి ముఖ్య అతిధులుగా విచ్చేసిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవదాయశాఖా మంత్రి కొట్టు సత్యనారాయణ, స్థానిక ఎంఎల్ఎ పర్వత పూర్ణచంద్ర ప్రసాద్‌లు రాష్ట్ర ప్రభుత్వం తరపున స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించగా, దేవస్థానం ఇఒ చంద్రశేఖర్ ఆజాద్ దంపతులతో పాటు జిల్లా అధికారులు, పాలకమండలి సభ్యులు కళ్యాణ సామగ్రిని వేదికవద్దకు తీసుకువచ్చారు. రాత్రి గం. 9.30లకు సుగంధభరిత పుష్పాలతో, విద్యుద్దీప కాంతులతో మనోహరంగా అలంకరించిన ప్రత్యేక కళ్యాణవేదికపై స్వామి అమ్మ వార్ల కళ్యాణమహోత్సవానికి శ్రీకారం చుట్టారు. విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం గావించి పాణిగ్రహసంకల్పం, కన్యావరణ కార్యక్రమాలను నిర్వహించి, సంప్రదాయబద్ధంగా మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చారణలతో రత్నగిరి ప్రతిధ్వనిస్తుండగా అర్చకులు స్వామి,అమ్మవార్ల శిరస్సులపై ఒకరికొకరు జీలకర్ర, బెల్లం ఉంచి నట్లుగా చేసి సుముహూర్తంలో మంగళ సూత్రధారణ, ముత్యాల తలంబ్రాలు, బ్రహ్మముడి, రక్షాబంధన కార్యక్రమాలను కళ్యాణ్ తంతు ప్రక్రియ పూర్తి చేశారు అనంతరం నూతన వధూవరుల పాణిగ్రహణంతో కళ్యాణతంతు వైభవంగా ముగిసింది. తదుపరి స్వామివారి ప్రసాదం, కళ్యాణ తలంబ్రాలను ప్రత్యేక కౌంటర్ల ద్వారా ఆలయ సిబ్బంది భక్తులకు వితరణ చేశారు. కళ్యాణాన్ని తిలకించడానికి వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా దేవస్థానం అధికారులు తగిన చర్యలు తీసుకోగా పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటుచేశారు.

సత్యదేవుని చరిత్ర పుస్తకం ఆవిష్కరణ

అన్నవరం సత్యనారాయణ స్వామి చరిత్రకు సంబంధించి బొమ్మలతో కూడిన పుస్తకాన్ని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ఆవిష్కరించారు. సత్యదేవుని కళ్యాణోత్సవానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆలయానికి వచ్చిన మంత్రికి దేవస్థానం ఇఒ ఎస్.ఆజాద్ ఆలయ మర్యాదలతో స్వాగతించారు. అనంతరం మంత్రి కొట్టు కుటుంబ సమేతంగా స్వామివారి దర్శించుకున్నారు. ఇఒ మంత్రికి స్వామివారి జ్ఞాపికను ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎంఎల్ఎ పర్వత పూర్ణచంద్రప్రసాద్, ఎసి రమేష్ బాబు, పాలక మండల సభ్యులు, పిఆర్ఒ కృష్ణారావు పాల్గొన్నారు.

వర్షాలకు కూలిన పెంకుటిల్లు

విరిగిపడిన 11కెవి విద్యుత్ స్తంభం:తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సోమవారం ఉదయం 7 గంటలకు 52.88 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు అయ్యింది. భారీ వర్షాలు ఈదురుగాలుల కారణంగా సామర్లకోట పట్టణంలోని 31 వ వార్డులో 11 కెవి విద్యుత్ స్తంభం విరిగిపడిపోయింది. ప్రమాదాన్ని గమనించిన అవార్డుకు చెందిన వాలంటీర్ అమల విద్యుత్ అధికారులకు సమాచారం అందించడంతో వారు ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరాలను నిలిపివేశారు. మండలంలోని హుస్సేన్ పురం గ్రామంలో వర్షాల కారణంగా ఆదివారం రాత్రి ఒక పెంకుటిల్లు ఒకవైపు భాగమంతా కూలి పోయింది. ఆ ఇంటిలోకాపురం ఉంటున్న ఉగ్గిన వెంకటేశ్వరరావు, సిహెచ్ శ్రీను, సిహెచ్ వెంకన్నల కుటుంబాలు కట్టుబట్టలతో నిరాశ్రయు లయ్యారు. నిత్యవసర వస్తువులు, దుస్తులు సైతం కూలిన శిథిలాల కింద ఉండి పోవడంతో వారి కుటుంబాలతో రోడ్డు పడ్డారు. అయితే తాము ఇబ్బంది పడుతున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు ఎవరూ కనీసం తొంగి చూడలేదని బాధిత కుటుంబీకులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని గంటలు తరబడి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. స్థానిక ఎఇ రమేష్ కుమార్ పర్యవేక్షణలో విద్యుత్తు లైనులను ట్రాన్స్కో సిబ్బంది పునరుద్ధ రిస్తున్నారు.


హుస్సేన్ పురంలో కూలిన పెంకుటిల్లు


20 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

విద్యార్థుల అపూర్వ కలయిక

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మండలం రాయ భూపాలపట్నంలోని జిల్లా పరిషత్ హై స్కూల్‌లో 2002-03 విద్యా సంవత్సరంలో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు 20 ఏళ్ల తర్వాత సోమవారం తాము చదివిన హైస్కూల్లో కలుసుకుని చిన్ననాటి ముచ్చట్లను నెమరు వేసుకున్నారు. నాడు విద్య నేర్పిన గురువులను సన్మానించి తమ కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రసాద్, సీతారాం,భారతి, రామారావు, రాజేశ్వరి, పూర్వ విద్యార్థులు పెనుమర్తి గంగాభవాని, నిమ్మలపూడి ఉషా మంగా, పుట్టా వెంకటలక్ష్మి, తిరుమల శెట్టి చంద్రకళ,సుహాసిని, శివకృష్ణ, నరేష్, సిద్దు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల ఆరోగ్య భద్రతపై దృష్టి

- 15 రోజుల్లో కార్యాచరణ సిద్ధం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ప్రజారోగ్య పరిరక్షణ కోసం ఎంతో కష్టించి పనిచేసే పారిశుధ్య కార్మికుల ఆరోగ్య భద్రతకు కూడా ప్రాధాన్యతనివ్వాల్సిన అవసరం ఉందని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనం ఆర్.మహేష్‌కుమార్ అన్నారు. ఇందులో భాగంగా చెత్త సేకరణ, రోడ్లు, డ్రైనేజీలను శుభ్రం చేసే కార్మికులు విధి నిర్వహణలో ఎదుర్కొనే ఆరోగ్యసమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవలసిన చర్యలు అనే అంశంపై 15 రోజుల్లో కార్యాచరణ సిద్ధం చేయాలని ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం అదనపు కమిషనర్ సిహెచ్ నాగ నరసింహారావుతో కలిసి ఈ అంశంపై కార్పొరేషన్ అధికారులు, కార్మిక సంఘాల ప్రతినిధులతో కమిషనర్ సమావేశమయ్యారు. హానికర, ప్రమాదకర వ్యర్థాలు సేకరించే క్రమంలో ఎంతోమంది కార్మికులు కేన్సర్, చర్మ వ్యాధులతో పాటు అనేక ఇతర రోగాల బారిన పడుతున్నారన్నారు. వాటిని అదుపు చేసేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై అధ్యయనం చేసేందుకు కమిటీ వేసేందుకు నిర్ణయించానన్నారు. ఎంహెచ్‌వో డాక్టర్ పృద్వీచరణ్, డిఇ మాధవి, ప్రొఫెసర్ డాక్టర్ బి.దేవి మాధురి, సాక్ష్యం సంస్థ ప్రతినిధి డాక్టర్ వెంకటరాజుతో కమిటీని వేస్తున్నామన్నారు. 15 రోజుల్లో కమిటీ నివేదిక వచ్చాక అవసరమైన అవసరమైన కార్యాచరణను సిద్ధం చేస్తామన్నారు. అదనపు కమిషనర్ నాగనరసింహారావు మాట్లాడుతూ కాకినాడ నగరంలోని వివిధ ప్రాంతాల్లో రెగ్యులర్ ఔట్ సోర్సింగ్‌లో 1200మంది కార్మికులు పని చేస్తున్నారన్నారు. వీరందరికీ ప్రస్తుతం మెడికల్ క్యాంపులు నిర్వహణతోపాటు తీసుకుంటున్న ఇతర చర్యలను వివరించారు. ఎంహెచ్‌వో డాక్టర్ పృద్వీచరణ్, డిఈ మాధవి, ప్రొఫెసర్ డాక్టర్ బి. దేవిమాధురి, సాక్ష్యం సంస్థ ప్రతినిధి డాక్టర్ వెంకట రాజు, కార్మికుల తరుపున కిర్ల కృష్ణారావు, తోకల ప్రసాద్, బొబ్బిలి శ్రీనివాస్, సూపర్‌వైజర్ రాంబాబు పాల్గొన్నారు.

మేజర్ డ్రైన్ అవుట్ లెట్ పరిశీలన

కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్ కుమార్ రావిరాల సోమవారం పారిశుధ్య పనులను ఆకస్మిక తనిఖీ చేశారు. తొలుత ఏడో సర్కిల్లో పర్యటించిన ఆయన అక్కడి మస్తర్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. కార్మికుల హాజరును పరిశీలించారు.. 24వ డివిజన్ రిక్షాలపేట ప్రాంతాన్ని సందర్శించి అక్కడ జరుగుతున్న పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. ఆయన వెంట డాక్టర్ పృథ్వీ చరణ్, శానిటరీ సూపర్వైజర్ రాంబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి నిధుల కోసం వినతి

ప్రజాశక్తి - ఉంద్రాజవరం

పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘ నిధులు మంజూరు కోరుతూ ఎపి సర్పంచుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో తాడిపర్రు సర్పంచ్ కరుటూరి నరేంద్రబాబు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. రాజమహేంద్రవరంలో కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్ మాధవీలతకు వినతిపత్రం అందజేసినట్లు నరేంద్రబాబు తెలిపారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టటానికి సంబంధించిన నిధులు వెంటనే విడుదల చేయాలని, సర్పంచులు నల్ల బ్యాడ్జీలు ధరించి కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలిపినట్లు చెప్పారు. కె.సావరం సర్పంచ్ నార్ని రామకృష్ణ పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న సర్పంచులు

ధాన్యం నూక శాతం పరిశీలన

ప్రజాశక్తి -గోకవరం

తహశీల్దార్ ఎ.శ్రీనివాస్, ఎంపిడిఒ కెవిఎస్ఎస్ఎస్.మూర్తి ధాన్యంలో నూక శాతం పరీక్ష చేసే మినీ మిల్లును సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మినీ మిల్లుపై ఒక టెక్నికల్ పర్సన్‌కు ట్రైనింగ్ ఇచ్చినట్టు తెలిపారు. మినీ మిల్లు ద్వారా ధాన్యంలో నూక శాతం ఎంత ఉందో తెలుసుకోవచ్చన్నారు. వ్యవసాయ శాఖ సిబ్బందికి టెక్నికల్ పర్సన్ ద్వారా ధాన్యంలో నూక శాతం ఎంత అన్నది మినీ మిల్లు ద్వారా పరీక్షించి చూపించినట్టు చెప్పారు. ఇఒ రాజేశ్వరి, వివిఎ విహెచ్ఎలు పాల్గొన్నారు

గుడ్డిగూడెంలో సిసి కెమెరాల ఏర్పాటు

ప్రజాశక్తి-గోపాలపురం

శాంతి భద్రతల పరిరక్షణ, నిఘా కోసం సిసి కెమెరాలు ఎంతో అవసరమని ఎస్ఐ కె.రామకృష్ణ అన్నారు. మండలంలోని గుడ్డిగూడెం సెంటర్‌లో గ్రామస్తుల సహకారంతో సిసి కెమెరాలు ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు. అనేక కేసుల్లో ఆధారాలను కనుగొనేందుకు సిసి కెమేరాల ప్రాముఖ్యత ఎంతో కీలకంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ శంకర్ పాల్గొన్నారు.